ప్రజాశక్తి

శనివారం 8 నవంబర్ 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

నిర్లక్ష్యమే అసలు రోగం



ఆంధ్రా యూనివర్సిటీ డిస్పెన్సరీ

- ఎయు డిస్పెన్సరీలో నేటికీ సమస్యలు
- వెంటాడుతున్న నిధుల కొరత
- అరకొరగానే సిబ్బంది నియామకం
- ప్రస్తుతం పనిచేస్తున్న వారికి జీతాలు అంతంతే..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆంధ్రా యూనివర్సిటీ డిస్పెన్సరీ (హెల్త్ సెంటర్) పట్ల పాలకుల నిర్లక్ష్యమే అసలు రోగంగా వెల్లడవుతోంది. అస్వస్థతకు గురై, సకాలంలో వైద్యం అందక ఈ ఏడాది సెప్టెంబర్ 25న ఎయులో చదువుతున్న బిఇడి విద్యార్థి వెంకట సాయి మణికంఠ మృతిచెందడంతో రెండు రోజులపాటు విద్యార్థులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఎయు యాజమాన్యం డిస్పెన్సరీ విషయంలో కొన్ని మార్పులు తీసుకొచ్చినా ఇంకా కొన్ని సమస్యలు అలానే ఉన్నాయి. నిధుల కొరత వెంటాడుతోంది. అరకొరగానే సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి జీత, భత్యాల విషయంలో సరైన ప్రామాణికాలను యూనివర్సిటీ యాజమాన్యం పాటించడంలేదు. దీంతో వారు అసంతృప్తితో ఉన్నారు.

వాస్తవానికి ఎయు డిస్పెన్సరీది దశాబ్దాల చరిత్ర. అయితే వర్సిటీ యాజమాన్యం నిర్వహణ పట్ల నిర్లక్ష్యం చూపడంతో ఈ ఏడాది సెప్టెంబర్ 25న విద్యార్థి వెంకట సాయి మణికంఠ మృతిచెందాడు. ఇది విశ్వవిద్యాలయ చరిత్రలో మాయని మచ్చగా మిగిలింది. డిస్పెన్సరీలో ప్రాథమిక వైద్యం మేరకే సేవలందిస్తుండటంతో అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. విద్యార్థి వెంకట సాయి మణికంఠ మరణం తర్వాత విద్యార్థులంతా పెద్ద ఎత్తున క్యాంపస్‌ను దిగ్బంధించారు. యాజమాన్య నిర్లక్ష్యంపై ధ్వజమెత్తారు. దీంతో కొన్ని సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు వైస్ ఛాన్సలర్ అంగీకరించాల్సి వచ్చింది. అయితే నేటికీ విద్యార్థినుల కోసం ఈ డిస్పెన్సరీలో గైనకాలజీ వైద్యులు లేరు. దీంతో వారు ఇబ్బందిపడుతున్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్‌ను త్వరలో గైనకాలజిస్ట్‌గా మిగతా 2లో..



విశాఖ నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న నర్సింగరావు

అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో..

కార్మిక రాజ్య స్థాపనకు పోరాటాలు

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
- విశాఖ నగరంలో కార్మికుల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో కార్మిక రాజ్య స్థాపన కోసం పోరాటాలు నిర్వహించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. దేశంలో ఆకలి, పేదరికం, నిరుద్యోగం లేని సమాజాన్ని సాధించడం కోసం, అందరికీ విద్య, ఉపాధి, తినటానికి తిండి, ఉండటానికి ఇల్లు, చేయడానికి పని కల్పించే విధంగా సోషలిజం సాధన కోసం ఉద్యమించాలని అన్నారు. అక్టోబర్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో సరస్వతి పార్కు నుంచి డాబాగార్డెన్స్, అంబేద్కర్ విగ్రహం, ఎల్ఐసి, ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆశీలుమెట్ట మీదుగా సెంట్రల్ పార్క్ వరకూ భారీ ప్రదర్శన సాగింది. ఎర్ర షర్టులు, చీరలు మిగతా 2లో..

ముగిసిన అనకాపల్లి పుస్తక మహోత్సవం

వార్త 8లో..

10 నుంచి ఆల్ ఇండియా పోస్టల్ టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు విశాఖలో 40వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు విశాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎన్‌విఎస్ఎన్.రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ నవంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు ఎంవిపి కాలనీ - 3 స్పోర్ట్స్ ఎరీనాలో జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు 14 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో భాగస్వామ్యం అవుతారని తెలిపారు.

10వ తేదీ ఉదయం 10 గంటలకు పోటీలు అట్టహాసంగా ప్రారంభమవుతాయని, 14వ తేదీ సాయంత్రం ముగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి, ముగింపోత్సవానికి జాతీయ స్థాయి క్రీడాకారులు, అధికార ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని, క్రీడాకారులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ టోర్నీ విశాఖకు మంచి గుర్తింపు తీసుకురానుందని తెలిపారు.

కెజిహెచ్‌లో విద్యుత్ పునరుద్ధరణ

వార్త 4లో..

మొదటి పేజీ తరువాయి..

నిర్లక్ష్యమే అసలు రోగం

నియమించే అవకాశం ఉందని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. అధునాతన పరికరాలు డిస్పెన్సరీలో లేవు. వీటికోసం నిధులు వెచ్చించడంలో, సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం కొనసాగుతోంది. 'ప్రజాశక్తి' గురువారం డిస్పెన్సరీని సందర్శించగా గతం కంటే కొన్ని కొత్త సంస్కరణలు జరిగినా నిధుల కొరతతో సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడం, వైద్యపరికరాల కొరత వంటి సమస్యలు కానవచ్చాయి.

కన్సాలిడేషన్ పేతో అవస్థలు

ఇటీవల విద్యార్థి మరణం తర్వాత వర్సిటీ డిస్పెన్సరీలో హడావుడిగా ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు, డాక్టర్ల నియామకాలను వర్సిటీ యాజమాన్యం కాంట్రాక్టు ప్రాతిపదికన, కన్సాలిడేషన్ పే పద్ధతిన చేపట్టింది. ఫార్మాసిస్టులు ముగ్గురు రూ.10 వేలు కన్సాలిడేషన్ పేతో చేరారు. స్టాఫ్ నర్సులు ముగ్గురు నియమితులయ్యారు. వారికి జీతం ఎటూ చాలనప్పటికీ ఉపాధి ఏదీ లేనందున ఈ వేతనాలకు చేరినట్లు వెల్లడించారు. వైద్యుల విషయానికొస్తే ఇద్దరు ఎంబిబిఎస్ వైద్యుల నియామకం ఇటీవలే జరిగింది. ఒక్కొక్కరికీ రూ.40 వేలు చొప్పున జీతంగా ఇస్తున్నారు. అదే సందర్భంలో స్పెషలిస్ట్ వైద్యులు స్కిన్ (చర్మవ్యాధులు), ఆర్థో (ఎముకలు) ఇఎండిటి (ముక్కు, చెవి)కి సంబంధించిన ముగ్గురికి అపాయింట్‌మెంట్లను ఎయు యాజమాన్యం ఇచ్చింది. కానీ వారు ఇంకా విధుల్లో చేరలేదు. జీతం విషయంలో వారికి సంతృప్తి లేదని తెలుస్తోంది. డిస్పెన్సరీలో ఎక్స్ రే, లేబొరేటరీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఇసిజి ఉన్నాయి. అయితే, అధునాతన పరికరాలు వస్తేగానీ వేల సంఖ్యలోగల విద్యార్థుల ఆరోగ్యానికి భరోసా ఉండదు. ఆసుపత్రిలో సౌకర్యాలు, సిబ్బంది జీతాల కోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరగాలన్న డిమాండ్ చాలా కాలంగా వినిపిస్తోంది. నెరవేర్చేదిశగా యాజమాన్యం చొరవ చూపడం లేదు.

అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో..
కార్మిక రాజ్య స్థాపనకు పోరాటాలు

ధరించి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటిసారిగా కార్మిక వర్గం రాజ్యాధికారం సాధించిన రోజుకు గుర్తు నవంబర్ 7 అని, రష్యాలో జార్ చక్రవర్తిని అధికారం నుంచి దింపి కార్మిక రాజ్యం ఏర్పడిన రోజని తెలిపారు. 78 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కూడా భారతదేశంలో తినటానికి తిండి, ఉండడానికి ఇల్లు, చేయడానికి పని లేక అనేకమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశ సంపద అంతా కొంతమంది కార్పొరేట్ల చేతుల్లో కేంద్రీకృతమై ఉందని అన్నారు. ధనికులకు, పేదలకు మధ్య వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కార్మిక హక్కులపై తీవ్రమైన దాడి జరుగుతోందని, దీనిని ఎదుర్కొనేందుకు పెద్ద ఎత్తున కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని, అవి అమలు జరిగితే కార్మిక వర్గంపై విపరీతమైన బారాలు పడతాయని అన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, 8 గంటల పని దినాన్ని పటిష్టంగా అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు తక్కువ లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మోడీ అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభలలో పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1500 మంది వివిధ రాష్ట్రాల నుండి కార్మిక నాయకులు హాజరవుతారన్నారు. జనవరి 4న లక్ష మందితో భారీ కార్మిక ప్రదర్శన జరుగుతుందన్నారు. దీనికి ముందుగా కార్మికులతో సాంస్కృతిక, కళా సంబరాలను 10 రోజులు పాటు నిర్వహిస్తామన్నారు. వీటన్నింటిలోను కార్మిక వర్గం, విశాఖ ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, నాయకులు బి.జగన్, పి.మణి, పి.వెంకటరెడ్డి, ఉరుకూటి రాజు, టి.నూకరాజు, ఎం.సుబ్బారావు, వై.రాజు, పి.వెంకటరావు, మూర్తి, వెంకటలక్ష్మి, సీత, ఐద్వా నాయకులు వై.సత్యవతి, బి.పద్మ, ఆర్ఎన్.మాధవి పాల్గొన్నారు.

పోర్టు క్యాజువల్ వర్కర్లకు ఇపిఎఫ్ చెల్లించండి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖ పోర్ట్ ట్రస్ట్‌లో ఏళ్ల తరబడి క్యాజువల్ వర్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్న తమకు పెండింగ్ ఇపిఎఫ్ (న్యూపెన్షన్ స్కీమ్) చెల్లించాలని పలువురు కార్మికులు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పోర్ట్‌ట్రస్ట్ సలహామండలి మాజీసభ్యులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో పలువురు కార్మికులు కార్యదర్శి వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. పోర్టు క్యాజువల్ కార్మికులు ఆయనను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. క్యాజువల్ కార్మికుల అసోసియేషన్ ప్రతినిధులు కేవిఎస్ వర్మ, ముక్కుగోపి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా కెజిహెచ్‌లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవన శైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు, దీర్ఘ కాలిక వ్యాధులుపెరుగుతున్నాయన్నారు. ముందుగానే గుర్తిస్తే కేన్సర్‌ను నయం చేయవచ్చన్నారు. ఇంటి వద్దకు వచ్చే ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి స్క్రీనింగ్ టెస్టుల విషయమై సహకరించాలన్నారు. ఈ పరీక్షలను పూర్తిగా ఉచితంగా చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పాల్, డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.400 కోట్ల బిల్లు బకాయిలను చెల్లించండి

జివిఎంసి కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ధర్నా



ధర్నా చేస్తున్న జివిఎంసి కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న రూ.400 కోట్ల బిల్లుల్లో కనీసం ఆరు నెలల బిల్లులను వెంటనే చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు నల్లబనీన్లు, నల్ల రిబ్బన్లు ధరించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా బకాయి పడిన ఎస్‌డిఎఫ్, జిజిఎంపిల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఫిఫో) పద్ధతి ప్రకారం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు జరగాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఎటువంటి తప్పులూ దొర్లకుండా నిధి పోర్టల్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. ఫిఫో ప్రకారం కాకుండా తమకు కావలసిన వారికి బిల్లులు ప్రాసెస్ చేయటాన్ని పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లుల జాబితా, పేమెంట్ అయిన జాబితా గతంలోవలే అకౌంటెంట్ విభాగంలో నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. తాము చెల్లిస్తున్న డిపాజిట్లను ఇఎండి, ఎఫ్ఎస్ఇ, ఎస్‌లు రెండు సంవత్సరాల కాల వ్యవధి అయిన వెంటనే తమకు అందేలా సాఫ్ట్‌వేర్ తయారు చేయాలని కోరారు. పద్ధతి ప్రకారం కాంట్రాక్టు పేమెంట్లు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. అడ్డదారిలో బిల్లులు ఇచ్చే విధానం పూర్తిగా నిలిపివేయాలన్నారు. జివిఎంసి బడ్జెట్ ఉన్న వర్కులకు మాత్రమే టెండర్లు పిలవాలని తెలిపారు. ధర్నా అనంతరం ర్యాలీగా వెళ్లి జివిఎంసి కమిషనర్, మేయర్‌లకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షులు పివివి.నాగరాజు, గౌరవ అధ్యక్షులు టి.వీరారెడ్డి, ఆర్‌వి.రమణారావు, వైస్ ప్రెసిడెంట్ జి.సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రమేష్, అధిక సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

శ్రీ కనకమహాలక్ష్మి బ్యాంకు శాఖ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి టౌన్ కొత్త రోడ్డు బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: దేశఅభివృద్ధికి సహకార బ్యాంకులు ఎంతగానో కృషి చేస్తున్నాయని, శ్రీ కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ కూడా దీనిలో ముందు ఉండాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఓల్డ్‌టౌన్ కొత్తరోడ్డు ప్రాంతంలో ఏర్పాటైన బ్యాంక్ శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దీవెనలతో, బ్యాంకు తమ 38వశాఖను టౌన్‌కొత్తరోడ్డులో ప్రారంభించటం హర్షించదగిన విషయం అన్నారు. చిన్న,మధ్య తరహా,ఉన్నత స్థాయి ప్రజలకు సహకారాన్ని అందించేందుకు బ్యాంకు అందుబాటులో ఉంటుందని, పాత నగరంలో ప్రజలంతా బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోఆపరేటివ్ రంగంలోనే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రంగాల ప్రజలకు సహకారంగా ఉండే విధంగా బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.అనంతరం బ్యాంకు స్ట్రాంగ్ రూము, క్యాష్‌కౌంటర్, ఎటిఎంలను అతిథులు జిల్లా రిజిస్ట్రార్ కిరణకుమారి, పైడా విద్యా సంస్థల ఛైర్మన్ పైడా కృష్ణప్రసాద్, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త ఆరిశెట్టి దినకర్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అండ్ క్రెడిట్ సొసైటీస్ (నాఫ్కబ్) డైరెక్టర్, విసిబి వైస్‌ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ జామిశెట్టి వెంకట సత్యనారాయణమూర్తి, ది మహారాజా కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ ఎం.మురళీకృష్ణవర్మ ఎయు రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికి 11 జిల్లాలో 38 శాఖలుగా విస్తరించి రూ.1,079 కోట్ల డిపాజిట్లతో, రూ.696 కోట్లు రుణాలు మంజూరుతో రూ.1775 కోట్లు వ్యాపారాన్ని తమ బ్యాంకు సాగిస్తోందన్నారు. ఎటిఎం సదుపాయం, మొబైల్ బ్యాంకింగు, యుపిఐ వంటి సదుపాయాలను కూడా తాము కల్పిస్తున్నామన్నారు. వృద్ధులకు డిపాజిట్లపై అత్యధికగా వడ్డీ రేట్లను కూడా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్ ఛైర్మన్ జి.రామకృష్ణ ఇతర డైరెక్టర్లు, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, ఇతర అధికారులు,టౌన్ కొత్తరోడ్డు శాఖ మేనేజరు కె. విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను ప్రత్యేక రాష్ట్రం చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: అత్యంత వెనుకబడిన ఉత్తరాంధ్రను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని ఉత్తరాంధ్ర సాధన సమితి వ్యవస్థాపకులు వేమిరెడ్డి లక్ష్మ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నింటా ఉత్తరాంధ్రపై వివక్ష కొనసాగుతోందన్నారు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఆనందపురం మండలంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 17 బాలురు విభాగంలో చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బోర గణేష్ (9వ తరగతి), బైరెడ్డి గణేష్ (10వ తరగతి) రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి.అచ్యుతరావు, బి.అప్పలరాజు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. ఆదినారాయణ విద్యార్థులను అభినందించారు.

పెందుర్తి : 94 వార్డు పరిధి రవినగర్ భాష్యం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.త్రిలోక్య, పదో తరగతి చదువుతున్న ఇ. జోత్స్న, 8వ తరగతి చదువుతున్న బి షణ్ముఖ శేఖర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రాఘవ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

'పిజిఆర్ఎస్' సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -మధురవాడ : పిజిఆర్ఎస్‌కు వచ్చే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. జివిఎంసి జోన్ -2లో అధికారులతో సమావేశమై పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై ఆరా తీశారు. నెలలు తరబడి సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ లో వచ్చిన రోడ్లు, కాలువలు, పార్కులు, విధిదీపాలు, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూలో ఉన్న పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ స్కూల్స్ పోటీల విజేతలకు బహుమతులు


ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సిడార్ స్కూల్స్ ఆధ్వర్యంలో సిడార్ ఫియస్టా (పండుగ) ఇంటర్ స్కూల్స్ పోటీల్లో భాగంగా శుక్ర వారం విద్యార్థులకు పలు అంశాలపై క్విజ్, వక్తృత్వ, పెయింటింగ్, వాలీబాల్, త్రోబాల్ పోటీలు జరిగాయి. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు సిడార్ స్కూల్స్ డైరెక్టర్ సెరీన్ వివేకా కంటి మహంతి, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ సునీత్ కౌమాన్, ప్రిన్సిపల్ కె.పల్లవి, సిడార్ ఐసిఎస్‌సి ప్రిన్సిపల్ స్వర్ణ కుమారి, బిఇడి కళాశాల ప్రిన్సిపల్ తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

సమాజాన్ని జాగృతం చేసే చిత్రాలు అవసరం

ప్రజాశక్తి-సీతమ్మధార : సమాజాన్ని జాగృతం చేసే చిత్రాలు ఎంతో అవసరమని కోర్టు మూవీ చిత్ర దర్శకుడు రామ్ జగదీష్ అన్నారు. వినోదంతో పాటు సమాజాన్ని చైతన్యం చేసే చిత్రాలను ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని, తాను అదే దారిలో పయనిస్తానని చెప్పారు. వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ పౌర గ్రంథాలయంలో 2025 సంవత్సరంలో విడుదలైన కోర్టు సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. చిత్ర దర్శకుడు విశాఖకు చెందిన రామ్‌జగదీష్ హాజరై మాట్లాడుతూ, సున్నితమైన అంశాలను అన్ని వర్గాల ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పగలిగితే ఎంతో కొంత మార్పు వస్తుందన్నారు. వైజాగ్ ఫిలిం సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, మంచి సినిమాలను ప్రజలకు చూపించడమే వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ముఖ్య లక్ష్యమన్నారు. వైజాగ్ ఫిలిం సొసైటీ అధ్యక్షులు కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, దర్శకుడు రామ్ జగదీష్‌ను స్ఫూర్తిగా తీసుకొని మరి కొంతమంది యువదర్శకులు ఈ దారిలో పయనించాలని ఆకాంక్షించారు. తదుపరి దర్శకుడు రామ్ జగదీష్‌ను నిర్వాహకులు సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో విశాఖ పౌర గ్రంథాలయం సెక్రటరీ డిఎస్.వర్మ, విఎఫ్ఎస్ ఉపాధ్యక్షులు ఉషారాణి, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, డాక్టర్ జ్ఞానేశ్వర్ బాబ్జి, డి.గాయత్రి, రాంప్రభు, సత్యవతి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డు టిడిపి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు టిడిపి నూతన కమిటీ ఎన్నికైంది. నూతన అధ్యక్షునిగా ఏడువాక సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శిగా తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులుగా మారిక జగన్నాధరావు, కిల్లంశెట్టి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా సోనాపురం సుధాకర్, గుంజ శ్రీనివాసరావు, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా మంగరాజు గణపతిరావు, గలాల రమణమూర్తి, కోశాధికారిగా నెల్లి అప్పారావు, ప్రచార కార్యదర్శిగా వారణాసి అప్పారావు, అధికార ప్రతినిధిగా పంగా రాధమ్మ, కార్యవర్గ సభ్యులుగా ఓసెట్టి పైడిరాజు, నేతల త్రినాధరావు, వై.సూరిబాబు, ఆర్.వెంకట్రావు, కె.వెంకటేష్, చింతలపూడి నాగేశ్వరరావు, ప్రశాంత్, నరేష్, దేవర శ్రీనివాసరావు, ఎస్‌కె.సేదును ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు వార్డులోని కార్యక్రమాల్లో పాల్గొని పార్టీకి మంచి పేరు తేవాలని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని చెప్పారు. నూతన అధ్యక్షుడు సన్యాసిరావు మాట్లాడుతూ, ఈ పదవి ఇచ్చిన ఎమ్మెల్యేకు, పాత్రకండ ధర్మారావుకు కృతజ్ఞతలు తెలిపారు.



13వ వార్డు నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే

ప్రేమానందరావుకు ఘన సన్మానం



ప్రేమానందరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం జెడ్పీ హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు డాక్టర్ కూర్మాన ప్రేమానందరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సహ ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధాయుడు కె.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రేమానందరావు నిబద్ధతతో పనిచేశారన్నారు. పద్మనాభం ఎంఇఒ బాబూలాల్ మాట్లాడుతూ, విద్యాశాఖలో ఎంఆర్‌పిల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రేమానందరావు ఆ బాధ్యతను త్రికరణశుద్ధిగా నిర్వర్తించారని గుర్తుచేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయునిగా అనేక మందికి శిక్షణ ఇస్తూ ఉత్తమ బిరుదులు పొందారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవేష్‌కుమార్, కెఆర్‌కె.పట్నాయక్, మురళీమోహన్, ఎం.పైడిరాజు, భాస్కరరావు, శంకరరావు, మహేష్, మూర్తి, ప్రసాద్, బుజ్జి, నాయకులు చందక సూరిబాబు, బంటుబిల్లి లక్ష్మి, కొట్యాడ సత్యమూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కార్పెంటర్ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం నేలతేరు గ్రామానికి చెందిన కార్పెంటర్ కడియం కనకరాజు (53) గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆనందపురం గ్రామంలోని ఒక కోళ్ల ఫారం షెడ్ నిర్మాణ పనుల కోసం కనకరాజు వెళ్లి అక్కడే మృతిచెందాడు. మొదట ఈ ఘటనను సహజ మరణంగా భావించినప్పటికీ, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు. మృతుడికి భార్య రమణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాత నేరస్తుడు అరెస్టు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడును ద్వారక పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ద్వారకా పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ద్వారకా ఎసిపి అన్నెపు నరసింహమూర్తి వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కిరణ్ (33) విశాఖ జ్ఞానాపురం ప్రాంతంలో నివసిస్తున్నాడు. సీతమ్మధార ఎన్ఆర్.నగర్ ప్రాంతానికి చెందిన గుంటూరు విక్రమాదిత్య వర్మ జులై 17వ తేదీన కుటుంబంతో కలిసి తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన కిరణ్ ఇంటి తాళం పగలగొట్టి పడకగదిలో ఉన్న బీరువాలో డైమండ్, బంగారు ఆభరణాలు దొంగిలించాడు. ఇంటి యజమాని తిరిగి 20వ తేదీన ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైమ్ ఎస్ఐ రాజు పరిసర ప్రాంతాల సిసి కెమెరాలను పరిశీలించి దొంగను పట్టుకున్నట్లు ఎసిపి వివరించారు. నిందితునిపై గతంలో మూడు దొంగతనాల కేసులు ఉన్నాయని, శిక్ష అనుభవించి వచ్చాడని తెలిపారు. ఈ సమావేశంలో ద్వారకా క్రైమ్ సిఐ చక్రధరరావు, ద్వారకా సిఐ రమణ, ఎస్ఐలు రాజు, అసిర తాత, ధర్మేంద్ర పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన 11వ ఆంధ్రప్రదేశ్ పురుషుల, మహిళల అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విశాలాక్షినగర్‌లోని బివికె హైస్కూలు వేదికగా ఈ నెల 10వ తేదీ వరకు ఈ పోటీలు జరగునున్నాయి. ముఖ్య అతిథులుగా భారతీ విద్యా కేంద్రం ఛైర్మన్, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవలు ఛైర్మన్ సీతమరాజు సుధాకర్, భారతీ విద్యా కేంద్రం కార్యదర్శి వి.సత్యనారాయణ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి, ఛైర్మన్ టిఎస్ఆర్ ప్రసాద్, టి.చెంగలరాయుడు, జి.చక్రవర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధి సాయిరాంకాలనీ, డ్రైవర్స్ కాలనీలలో రూ.12 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువల నిర్మాణానికి కార్పొరేటర్ మొల్లి హేమలత శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ, వార్డులో పలు అభివృద్ధికి పనులకు నిధులు మంజూరయ్యాయని, కొండవలస ప్రాంతాల్లో రోడ్లు, కాలవలు, మెట్ల మార్గాల పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, తిరుమలరావు, రాజు, బొడ్డేపల్లి రంగారావు, ఆవాల నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం శుక్ర వారం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఫణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో నాన్ కమ్యూనిబిల్ డిసీజెస్ (ఎన్‌సిడి) వైద్యాధికారి స్వర్ణరేఖ మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము, గర్భాశయ కేన్సర్ ఎలా వస్తుంది, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 40 ఏళ్ల పైబడిన మహిళలు 6 నెలలకోసారి తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దంత వైద్యులు సురేఖ బెహరా, యునాని వైద్యులు ప్రతిభ, హెడ్ నర్స్ వినూత కుమారి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. సదస్సుకు ముందు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ స్వర్ణరేఖ

కెజిబివిని సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. పలు రిజిస్టర్లు పరిశీలించారు. పాల్ ల్యాబ్, స్టోర్ రూమ్ పరిసరాలను సందర్శించారు. అసెస్మెంట్ పుస్తకాలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. టెన్త్‌లో శత శాతం ఫలితాలు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. కెజిబివి ప్రిన్సిపల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్‌యార్డ్ బ్రిడ్జిని ప్రారంభించాలి

ప్రజాశక్తి -మూలగాడ : నేవల్ డాక్‌యార్డు బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభించాలని సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మల్కాపురం బస్టాప్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ డాక్‌యార్డు బ్రిడ్జిని 2024 ఆగస్టు 1 మూసి వేశారని, 9 నెలలోనే పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారని, నేటికి 15నెలలు పూర్తవుతున్నా ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రారంభ తేదీలు ప్రకటిస్తూ వాయిదాలు వేస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ముందుగా అక్టోబర్ 2 ప్రారంభిస్తామన్నారని, నవంబర్ 1వ తేదీ అని, ఇప్పుడు ఈ నెల 11వ తేదీన ప్రారంభిస్తామని చెబుతూ వస్తున్నారని తెలిపారు. బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్‌చేశారు. జోన్ నాయకులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ డాక్ యార్డ్ బ్రిడ్జి మూసి వేయడం వల్ల వాహనదారులంతా మారుతి జంక్షన్ మీదుగా 6 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు. విశాఖ నగరంలోకి వెళ్లేవారంతా ఈ రహదారి మూత వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే బ్రిడ్జిని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఎ.సత్యారావు, ఎన్.శ్రీనివాసరావు, కార్యకర్తలు జి.నరేష్ డి.రాజేష్, వాసు,ప్రేమ్, సమీన్, గణేష్, నీలయ్య, గంగాధర్, దుర్గా, రామకృష్ణ, కిరణ్, నాగేష్, ప్రశాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పలుచోట్ల సివి.రామన్ జయంతి

ప్రజాశక్తి-యంత్రాంగం

మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవం, ప్రముఖ శాస్త్రవేత్త సర్ సివి.రామన్ 137వ జయంతి కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో గల సర్ సివి.రామన్ విగ్రహం వద్ద గీతం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంతరామకృష్ణ పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళు లర్పించారు. ఈ సదర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు గీతం లోని సైన్స్, ఇంజినీరింగ్ ప్రయోగశాలలను సందర్శించే అవకాశం కల్పించారు. అనంతరం జరిగిన సైన్స్ దినోత్సవంలో గీతం ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ నోబుల్ బహుమతి గ్రహీతలను స్ఫూర్తిగా తీసుకుని శాస్త్ర విజ్ఞాన రంగంలో పరిశోధనలు జరపాలని పిలుపునిచ్చారు. ఐఐటి భువనేశ్వర్ నుంచి స్కూల్ ఆఫ్ బేసిక్ సైన్సెస్ ప్రొఫెసర్ రాజన్ మాట్లాడుతూ, సి.వి.రామన్ కాంతి కిరణాలపై జరిపిన అధ్యయనాలు, ప్రస్తుతం వైద్య రంగంలో వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో విశిష్ట ప్రొఫెసర్ టాటా, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెందుర్తి : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మేడమ్ మేరీ క్యూరీ, సర్ సివి రామన్ జయంతిని నిర్వహించారు. నోబెల్ గ్రహీతల జీవితం స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో విద్యుత్ పునరుద్ధరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : నిర్వహణ పనుల కారణంగా విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రిలో కొన్ని బ్లాకులలో ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని ఆసుపత్రి సిబ్బందితో కలిసి విద్యుత్ సిబ్బంది గురువారం రాత్రికి సరఫరాను పునరుద్ధరించారని ఏపిఇపిడిసిఎల్ విశాఖపట్నం సర్కిల్ ఎస్ఇ జి.శ్యాంబాబు తెలిపారు. కెజిహెచ్‌లో మంచినీటి పైపు లైను నిర్వహణలో భాగంగా ఏపిఎంఎస్ఐడిసి ఆధ్వర్యంలో చేపట్టిన పనులలో క్రిటికల్ కేర్ బ్లాక్ నందు తవ్వినట్లు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా పొరపాటున భూగర్భంలోని అంతర్గత విద్యుత్ కేబుల్‌ను తవ్వడంతో కొన్ని విభాగాలకు విద్యుత్ అంతరాయం కలిగిందని వివరించారు. సమస్యను గుర్తించిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. కేబుల్ పోయిన ప్రాంతాన్ని జాయింట్ కిట్టు ద్వారా మరమ్మతు చేయుటకు కొంత సమయం పట్టిందని వివరించారు. అర్ధరాత్రి 11.45 గంటలకు పూర్తిస్థాయిలో అన్ని విభాగాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి- ములగాడ : కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఐఎన్‌టియుసి కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో హెచ్‌పిసిఎల్ లేబర్ గేట్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులకు అక్టోబర్ 1వ తేదీ నుంచి జీతాలు పెరగాల్సి ఉందని, అయినా పెరగకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. జీతాల విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి యాజమాన్యం తీసుకెళ్లి పెంచేలా కృషి చేయాలని కోరారు. సకాలంలో జీతాలు ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో తాతబాబు, సోమనాథ్, పెద్దాడ కుంచారావ్, రాజేష్, బి.నాని తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి శంకుస్థాపన

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి ఎస్‌టి కాలనీకి ఆనుకుని ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దహన సంస్కారాలకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా అన్ని సదుపాయాలూ ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు జిత్తుక అప్పలరాజు, సెక్రటరీ కూన వెంకట్రావు, బొడ్డు సత్యారావు, శ్రీధర్, కోటయ్య, రాజశేఖర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

యారాడ కొండపై పైప్‌లైన్ లీకేజీ

ప్రజాశక్తి -ములగాడ : యారాడ కొండపై ఎంఇఎస్ పైప్ లైన్ లీకు కావడంతో రోడ్డంతా జలమయమైంది. మట్టిని కొట్టుకుపోయి సిమెంట్ రోడ్డు పైకి తేలిపోయింది. దీంతో అటుగా ప్రయాణించే యారాడ గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. విషయం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబుకు తెలియడంతో శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు సిరుగుడి రాములు సంస్మరణ సభ



ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సిరుగుడి రాములు సంస్మరణ సభను శనివారం నిర్వహిస్తున్నారు. ఆదయ్య, అప్పలనరసమ్మ దంపతులకు మూడో సంతానంగా 1928 సెప్టెంబర్ 9న జన్మించిన రాములు అప్పట్లో థర్డ్ ఫారం (8వ తరగతి) చదువుకున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చినప్పటికీ తండ్రి ఆదేశాల మేరకు ఉద్యోగంలో చేరలేదు. తండ్రి చేసే వ్యవసాయం, వ్యాపారంలో సహాయకారిగా ఉండేవారు. అనతి కాలంలోనే వ్యాపారంలో అనేక మెలకువలు నేర్చుకొని టోకు వర్తకం ప్రారంభించారు. ఆర్థికంగా వెనుకబడి వారిలో కొంతమందిని వ్యాపార భాగస్వాములుగా చేసుకొని వ్యాపారాన్ని నలుదిక్కులా వ్యాపింప చేశారు. 1952లో అదే గ్రామానికి చెందిన చిట్టమ్మను వివాహం చేసుకున్నారు.

1970లో గ్రామ ప్రజల ఆకాంక్ష మేరకు రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. సర్పంచ్ ఎన్నికల్లో వార్డు మెంబర్‌గా గెలుపొందారు. 1980లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గాను, భీమిలి సమితి ఉపాధ్యక్షులుగాను ఎన్నికయ్యారు. 1995 ఎన్నికల్లో కూడా గ్రామ సర్పంచిగా ఎన్నికయ్యారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా సేవలందించారు.

రాములకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు ఆదినారాయణ ప్రస్తుతం గ్రామ ఉపసర్పంచ్‌గా వైసిపిలో ఉన్నారు. రెండవ కుమారుడు గణపతిరావు వ్యాపారం, వ్యవసాయం సాగిస్తున్నారు. మూడో కుమారుడు శ్రీనివాసరావు ఢిల్లీ పాలిటెక్నికల్ కాలేజీ మెకానికల్ హెచ్ఓడిగా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. కుమార్తె సూర్యకాంతానికి అదే గ్రామానికి చెందిన ఎస్‌వియల్ నారాయణరావుతో వివాహం చేశారు. వారు వ్యాపారవేత్తలు. రెండో కుమార్తె భాగ్యలక్ష్మి. ఆమె భర్త ఎం.మోహన్‌రావు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ సైన్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.


డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భెల్ సిఐటియు నాయకులు

భెల్ గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ భెల్ యూనిట్‌లో తక్షణమే గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సెంట్రల్ విశ్వ భూషణ్ పుష్టికి బిహెచ్‌పివి ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. విశాఖ వచ్చిన సందర్భంగా ఆయన్ను కలిశారు. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున చట్ట ప్రకారం జరిపి కార్మిక హక్కులు నిలబెట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిఐటియు ప్రధానకార్యదర్శి జిటిపి ప్రకాష్, కోశాధికారి నారపురెడ్డి, ప్రచార కార్యదర్శి జగన్నాధరావు ఉన్నారు.

విజ్ఞాన్ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి- ఉక్కునగరం : దువ్వాడ విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (అటానమస్) కళాశాల విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మెడ్ టెక్ జోన్‌ను సందర్శించారు. 62 మంది ద్వితీయ సంవత్సరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ) విద్యార్థులు పాల్గొన్నారు. కన్వెన్షన్, ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్లను సందర్శించి, వివిధ ప్రాసెస్ టెక్నిక్స్, ఆర్టిఫిషియల్ పరికరాల తయారీ, ప్రదర్శనలను పరిశీలించారు. మెడికల్ టెక్నాలజీ పార్క్, టెస్టింగ్ సెంటర్లు, గామా రేడియేషన్ సెంటర్ ఫర్ 3డి ప్రింటింగ్, లేజర్ సెంటర్లు, గామా రేడియేషన్ యూనిట్లు తదితర సాంకేతిక విభాగాలను పరిశీలించి అధ్యయనం చేశారు. ఈ సందర్శనలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎస్.వెంకటఆనంద్, ఇఎస్.సందు కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా మెడిటెక్ జోన్ యాజమాన్యానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.సుధాకర్, రెక్టర్ డాక్టర్ వి.మధుసూధనరావు, విభాగాధిపతులు డాక్టర్ ఆర్.ఉమామహేశ్వరరావు, డాక్టర్ పి.సంతోష్ అభినందనలు తెలిపారు.



మెడ్‌టెక్ జోన్‌ను పరిశీలించిన విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

87వ వార్డులో ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి లక్ష్మీపురంకాలనీలోని త్రిశక్తి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో డ్రైడే - ఫ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాధం మాట్లాడుతూ, దోమలు పట్ల జాగ్రత్తలు వహించాలని, ఇవి డెంగీ, మలేరియా తదితర వ్యాధులకు కారణమవుతున్న కారణంగా వాటి నివారణకు ప్రతి శుక్రవారమూ పరిసరాల్లో డ్రైడే పాటించాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, చెత్తను జివిఎంసి సిబ్బందికి అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, రాజన్‌రాజు, డివి.అప్పారావు, సత్తిబాబు, జివి.రమణ, విశ్వేశ్వరరావు, అవిరెడ్డి సూర్యనారాయణ, కణితి ఈశ్వరరావు, జాన్ రమేష్, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఇండస్ట్రీ ఓనర్స్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని అభినందిస్తున్న వాసవ అధ్యక్ష, కోశాధికాలు పాండురంగప్రసాద్, ప్రభాకర్

ప్రజాశక్తి -గాజువాక : ప్లాస్టిక్ ఇండస్ట్రీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ శుక్రవారం ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా బి.నాగిరెడ్డి, అధ్యక్షులుగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా పి.ధర్మేంద్ర, ట్రెజరర్‌గా ఎల్.గాంధీ, ఉపాధ్యక్షులుగా మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు వాసవ అధ్యక్షులు సజ్జ పాండురంగ ప్రసాద్, కోశాధికారి ఐసోటెక్ ప్రభాకర్ పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు.

59 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : చిప్పాడ దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో శుక్రవారం గుడివాడ పంచాయతీలోని ఎంపిపి స్కూల్లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీరామ్‌నగర్, పాత చెరుకుపల్లి, ఎరుకుపేట పాఠశాలల విద్యార్థులు 59 మందికి పోలిపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ లక్ష్మి వైద్య సేవలందించారు.

తుపాన్ బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తుఫాన్ కారణంగా అధిక వర్షాలతో నష్టపోయిన ఉద్యానవన పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. మండలంలో మడుతూరు గ్రామంలో తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని ప్రభుత్వం చెప్పిందని, కాని తుఫాన్ పోయి పది రోజులు కావస్తున్న నేటికీ రైతులు నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బందితో నమోదు చేయలేదని పేర్కొన్నారు. బొప్పాయి, అపరాలు తదితర పంటలు అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్నాయన్నారు. వెంటనే ఉద్యానవన శాఖ అధికారులు గ్రామాలలో పర్యటించి నష్టపోయిన పంటలను నమోదు చేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిఐటియు నాయకులు కె.సోమునాయుడు, నష్టపోయిన రైతులు తోట వెంకటేశ్వరరావు, నడిపూరి సోములు, మోటూరు భద్రాద్రి, నడిపూరి నాగేశ్వరరావు, పప్పల రాము, చిన్ని నర్సింగ్‌రావు ఉన్నారు.



దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న రైతు నాయకులు

విద్యార్థులు సామాజిక బాధ్యతతో సేవ చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా "డ్వామా" ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.పూర్ణిమాదేవి అన్నారు. కింతాడ, జోగన్నపాలెం గ్రామాల్లో అయ్యన్న జూనియర్, డిగ్రీ కాలేజీల జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన ఏడురోజుల చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలు శుక్రవారంతో ముగిసాయి. అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం అధ్యక్షతన జరిగిన ముగింపు సభ జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రమణి, ఎన్ఎస్ఎస్ పీఓలు గాడి అప్పారావు, సీముసురు రమణ, టీడీపీ నేత కన్నూరు సూర్యనారాయణ, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, మాజీ జడ్పీటీసీ కశిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కేసుల్లో నిందితుల బైండోవర్

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండలంలో బెల్టు దుకాణాల నిర్మూలన చర్యలలో భాగంగా పాత కేసుల్లో పట్టుబడిన 8 మంది నిందితులను తహశీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జి. ఆనందరావు ఎదుట బైండోవర్ చేశామని అనకాపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ వై.లక్ష్మునాయుడు తెలిపారు. ఈ బైండోవర్ ఏడాది పాటు అమల్లో ఉంటుందన్నారు. దీనిని అతిక్రమిస్తే లక్ష రూపాయల జరిమానా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది కేఎస్. గణేష్ , ఎస్. వి. నారాయణ, పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు.

కేన్సర్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : కేన్సర్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. జాతీయ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సిలో అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశములో నోటి, బ్రెస్ట్, గర్భాశయ ముఖద్వారా కేన్సర్లు నివారించడానికి ప్రతి ఒక్కరూ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమం సిబ్బంది సత్యనారాయణ, పణి భూషన్, ముసిలి నాయుడు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో వేమగిరి గ్రామంలో మొంథా తుఫాన్ ప్రభావంతో విద్యుత్ స్తంభం ఒరిగిపోగా, శుక్రవారం అది నేల కూలింది. ఘటన జరిగిన సమయంలో ఎవరు లేకపోవడం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు అధికారులకు తెలియజేయడంతో వారు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. దీంతో ప్రమాదం తప్పింది.

వైన్ షాపుల యజమానుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : అనకాపల్లి జిల్లాలో ఉన్న వైన్ షాపుల యజమానుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను అమరావతిలో కలిసి విన్నవించినట్లు అనకాపల్లి వైన్స్ సిండికేట్ అసోసియేషన్ సెక్రెటరీ కొయిలాడ కమల్ తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వైన్ షాపులను నడవడం చాలా భారంగా ఉందని, ఖర్చులు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం ఇస్తానన్న పర్సంటేజ్ సరిపోవటం లేదని తెలిపారు. ఎమ్మార్పీ మీద 20శాతం మార్జిన్ ఇవ్వాలని మంత్రిని కోరగా, దానికి ఆయన సానుకూలంగా స్పందించనట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రవివర్మ, మెంబర్లు కొండబాబు, విజయ్ పాల్గొన్నారు



మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన వైన్ సిండికేట్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన పరవాడ సర్పంచ్, కార్యదర్శి

ప్రజాశక్తి-పరవాడ : "అధ్యానంగా పరవాడ శ్మశానవాటిక" అనే శీర్షికన అక్టోబర్ 12న ప్రజాశక్తి పత్రికలో ప్రచురించిన కథనంపై పరవాడ గ్రామ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్ స్పందించారు. ఎన్‌టిపిసి సంస్థ సిఎస్‌ఆర్ నిధులు నుండి రూ.12 లక్షలు మంజూరు చేయించి శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ, శ్మశానవాటిక పరిశుభ్రంగా, గౌరవప్రదంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రహరీ, వెయిటింగ్ హాల్, ఆధునిక టైల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో నీటి సౌకర్యం, లైటింగ్, పచ్చదనం కోసం మొక్కలు కూడా నాటుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, టిడిపి నాయకులు పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, పోతల అప్పలనాయుడు, గండి ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విడిఎ పాయింట్లు వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : విడిఎ పాయింట్లు వెంటనే విడుదల చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అక్టోబర్ నెల పూర్తయినా నేటికీ కార్మికశాఖ విడిఎ పాయింట్లు గెజిట్ విడుదల చేయకపోవడం కార్మికులకు నష్టదాయకమని పేర్కొన్నారు. పరవాడలో శుక్రవారం జరిగిన సమావేశంలో గనిశెట్టి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విడిఎ పాయింట్స్ పెరగవలసి ఉందని తెలిపారు. ప్రతి ఏటా ఏప్రిల్, అక్టోబర్ నెలల్లో వినమయ ధరల సూచిక ఆధారంగా వేరియబుల్ డియర్నెస్ అలవెన్స్ (వీడిఏ) పాయింట్స్‌ను విడుదల చేయవలసి ఉందని చెప్పారు. నేటికీ విడిఎ గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించకపోవడంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కార్మికశాఖ విడిఎ పాయింట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు టి మల్లేశ్వరరావు, కే కృష్ణ, లక్ష్మణరావు, రమేష్, నాగరాజు, రాము, ఈశ్వరరావు, దేవా కిషోర్ పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో ఉల్లాసంగా రిమ్ జిమ్

ప్రజాశక్తి-పాయకరావుపేట : శ్రీప్రకాష్ విద్యా సంస్థలో జరుగుతున్న రిమ్ జిమ్ వేడుకల్లో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విద్యార్థుల మధ్య పోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యా సంస్థల తుని, పాయకరావుపేట, అన్నవరం శాఖలకు చెందిన సుమారు 5,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాహిత్యం, సంగీతం, ఆటలు, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాలపై జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలలో 31 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ నీళాదేవి, అకడమిక్ ఇంఛార్జిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వృత్తి నైపుణ్య పోటీలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అనకాపల్లి జిల్లాస్థాయి వృత్తి నైపుణ్య పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనకాపల్లి జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.జయప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ చదువుతున్న విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు స్కిల్ కాంపిటేషన్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 14న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. 10 పాఠశాలలకు చెందిన పదిమంది విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా జిసిడివో ఏఎస్‌డి జమీమా, ఎంఈఓ-2 ఎంజె.రవీంద్రబాబు, జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ ఎం. సుధాకర్, ఎస్. రమేష్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చోడవరం : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి నిరసనగా శుక్రవారం చోడవరం కొత్తూరు జంక్షన్‌లో కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రైవేటువారికి ధారాదత్తం చేయడం దారుణమన్నారు కార్యక్రమంలో వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, జడ్పిటిసి దొండా రాంబాబు, పుల్లేటి వెంకటేష్, ఏడువక సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ బైలపూడి గౌరీ రామారావు ఆధ్వర్యంలో గ్రామ వైసిపి అధ్యక్షుడు సింగంపల్లి సన్యాసయ్య అధ్యక్షతన శుక్రవారం మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కర్రి బాబు పాల్గొన్నారు.

దార్లపూడిలో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని మేజర్ పంచాయతీ దార్లపూడిలో ఎంపిడిఓ పి.మీనా కుమారి శుక్రవారం పర్యటించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పారిశుధ్యం నిర్వహణ చేయాలని, ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.



హాకీ పోటీలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న రమాకుమారి

జిల్లాస్థాయి హాకీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి, యలమంచిలి టౌన్ : దేశంలో ఇండియన్ హాకీ ఫెడరేషన్ ఏర్పడి 100 వసంతాలు పూర్తయిన సందర్భంగా జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యాన పట్టణంలోని డిగ్రీ కళాశాల గ్రౌండ్లో జిల్లా స్థాయి హాకీ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాకీ క్రీడాకారులకు పిట్టినిల్లుగా యలమంచిలి ప్రసిద్ధి చెందిందని చెప్పారు. అనంతరం సీనియర్ హాకీ క్రీడా కారుడు గదుల సత్యనారాయణను, స్థానిక జెడ్పీ హైస్కూల్లో పిఇటి శిరీషను సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కర్రి ఝాన్సీ, బొద్దపు శ్రీనివాసరావు, మోటూరు గోపి, జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ కొఠారు నరేశ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్రి ఝాన్సీ స్పాన్సర్ చేసిన హాకీ స్టిక్స్‌ను క్రీడాకారులకు అందించారు.

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో ఆయన టీడీపీ శ్రేణులు, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసి నాయుడు, నాయకులు బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్, బోలిశెట్టి శ్రీనివాసరావు, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, తలారి కాశీ నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికే ఎంఎల్‌సిసి

ప్రజాశక్తి-కోటవురట్ల : పిజిఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులు మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ ద్వారా పరిష్కరించేందుకే ఇరువర్గాలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తిరుమల బాబు తెలిపారు. శుక్రవారం నాలుగు కేసులకు సంబంధించిన వారితో సమావేశం ఏర్పాటు చేశారు. చిన్న బొడ్డేపల్లి గ్రామానికి చెందిన రెండు సమస్యలు, కొడవటిపూడి ఒక కేసు, తంగేడు గ్రామానికి సంబంధించి ఒక కేసుపై చర్చలు జరపగా తంగేడు కేసు పరిష్కారమైనట్లు తహశీల్దారు చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల విఆర్ఒలు రమేష్, హంసా దేవి, శ్రీనివాస్, వెంకటసుధ, జూనియర్ అసిస్టెంట్ సత్తిబాబు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెదమదిన గ్రామ కుమ్మరి వీధిలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల విగ్రహాన్ని గ్రామ పెద్ద కొల్లిమళ్ళ అచ్చంనాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొల్లమాంబ తన రచనల ద్వారా సమాజానికి సందేశాన్ని ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు మాకవరపు లక్ష్మి, గ్రామ సర్పంచ్ కెవిఆర్ నాయుడు, వార్డు మెంబర్ కరకపాటి రాము నమ్మి శ్రీనివాస్ వియ్యపు గోవింద్, వియ్యపు రామరాజు, కొల్లిమళ్ల మాణిక్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జివిఎంసి 83వ డివిజన్ పరిధిలో వేల్పుల వీధిలో జరుగుతున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులను టిడిపి 83, 82 డివిజన్ల ఇన్‌చార్జులు బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్ శుక్రవారం పరిశీలించారు. సుమారు రూ.20 లక్షలతో వేల్పులవీధి శ్రీ కాశీ విశ్వనాథ స్వామి గుడి ఎదురుగా గల రోడ్డు పనుల్లో నాణ్యతను పర్యవేక్షించారు. కార్యక్రమంలో టిడిపిఇ నాయకులు పోలమేరా ఆనంద్ కుమార్, అయోధ్య వాసు, కొణతాల గణేష్, ఆకుల నానాజీ, ఎస్ భానుచందర్, షేక్ రియాజ్, నాగు, ప్రసన్న పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోవాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం శ్రీవివేకానంద జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జూనియర్ కళాశాల ఎంపిహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టి విద్యార్థులు సుమారు 150 మందికి బరువు, బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, పల్స్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రామఅప్పారావు, సర్పంచ్ ఏడువాక వెంకట సత్యారావు, స్థానిక నాయకులు ఏడువాక లక్ష్మణ్ కుమార్, ఏడువాక అర్జునరావు, వివేకానంద జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామారావు గహబాబు రాజు, విద్యార్థి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పూసర్ల సంతోష్ కుమార్, మేడిశెట్టి శంకర్రావు పాల్గొన్నారు.

పలుచోట్ల వందేమాతరం గేయాలాపన



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నేతలు

ముగిసిన కులవృత్తుల అధునాతన శిక్షణ

ప్రజాశక్తి-పరవాడ : కులవృత్తి ఆధారంగా జీవనం సాగించే గ్రామీణ కార్మికుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి 3, 4 బ్యాచ్‌ల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. మండలంలోని జాజులవానిపాలెం గ్రామాల్లో జరిగిన ముగింపు కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత నెల 29 నుంచి 10 రోజుల పాటు కెవిఐసి ఆధ్వర్యంలో మట్టి పాత్రల తయారీదారులకు ఈ శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన లబ్ధిదారులకు త్వరలోనే సర్టిఫికెట్లు, సారెలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్వరాజ్ సంఘం అధ్యక్షుడు ఐవి.రమణ, అనకాపల్లి జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అనకాపల్లి రామస్వామి, కోశాధికారి మాకారపు సత్యనారాయణ, బర్నికాల గోవిందరావు, శిక్షణ టీచర్ ఎస్.అబ్బులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాను మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీస్ సిబ్బంది సంక్షేమ కార్యక్రమాల విస్తరణపై సానుకూల చర్చలు జరిపారు. విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు సంఘం తరపున ప్రతిపాదనలు సమర్పించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఉత్సాహంగా స్పందిస్తూ, పోలీస్ కుటుంబాలకు అండగా నిలిచే కార్యక్రమాలకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్సై శేషగిరి రావు, సత్యనారాయణ, అచ్చయ్య, శేషాద్రి, శ్రీధర్, లలిత, మల్లేశ్వరి పాల్గొన్నారు.

డైట్‌లో ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఏపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అసోసియేషన్ మూడవ సంవత్సరం సిఎస్ఇ విద్యార్థుల కోసం ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్మెంట్‌పై ఐదు రోజుల వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించింది. వినూత్న మొబైల్ అప్లికేషన్లను అభివృద్ధి చేయడంలో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతను పెంపొందించడం ఈ వర్క్‌షాప్ లక్ష్యమని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ కె.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, సాంకేతిక శిక్షకుడు ఎస్.వర ప్రసాద్ పాల్గొన్నారు.

రైతుల కమతాల్లో వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక రైతుల కమతాలలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ తన సొంత నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. వాటిని గురువారం రాత్రి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని రైతు మూల సంఘాల కమతాలలో సాయంత్రం చీకటి పడే సమయానికి పాడి రైతులు, రైతులు, మహిళలు విష కీటకాల వలన ప్రమాదాల బారిన పడకుండా వీధి లైట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, మొలబంధగోడి రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డి నూకరాజు, దాడి శివ నాగఅప్పారావు, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, సూరిశెట్టి దుర్గ నాయుడు, సూరిశెట్టి శ్యాము, రైతులు పాల్గొన్నారు.



వీధిలైట్లను ప్రారంభిస్తున్న టిడిపి నేత సాయికృష్ణ

ప్రజాశక్తి -యంత్రాంగం

వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్ర వారం పలుచోట్ల ఆ గీతాన్ని ఆలపించారు.

భీమునిపట్నం : స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విద్యార్థులు వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ ఎం.శివరాణి, ప్రధానోపాధ్యాయులు పొన్నగంటి రమణ తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధిలోని లక్ష్మీ అమర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 150 మంది విద్యార్థులు ఒకేసారి 150 సార్లు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వందేమాతరం గేయం భారత స్వాతంత్య్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందన్నారు.

మల్కాపురం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సిఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

తగరపువలస : చిట్టి వలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతరం గీతాన్ని విద్యార్థులు, అధ్యాపకులు సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.శ్రీవాణి, ఎ.సీతారత్న బి.సీతంనాయుడు పాల్గొన్నా.

వేపగుంట : విశాఖ ఇంజనీరింగ్ కళాశాలలో వందేమాతరం 150 సంవత్సరాలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి.జీవనరావు, డీన్ శాంతారావు పాల్గొన్నారు.

ఆనందపురం : తర్లువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా వందేమాతర గేయాన్ని ఆలపించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం పి.జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్, సరస్వతి విద్యా విహార్‌లో వందేమాతరం గీతాన్ని 675 మంది విద్యార్థులు సంయుక్తంగా ఆలపించారు.

సీతమ్మధార : సీతమ్మధార రైతు బజార్‌లో



ర్యాలీ చేస్తున్న విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వందేమాతర గీతాన్ని ఆలపించారు. రైతులు, వినియోగదారులు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ, గోపి, ఆర్.భరత్‌కుమార్, కోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : గాజువాకలోని విజ్ఞాన్ హైస్కూల్లో విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ప్రధానోపాధ్యాయులు కౌసర్ పరవీన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజీవ్ మార్గం నుండి అప్పన్న కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కాట్ మాస్టర్ రమణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనకాపల్లి : వందేమాతరం 150 ఏళ్ల వేడుకల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో "వందేమాతరం" గీతాలపన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడారు.

యలమంచిలి, యలమంచిలి టౌన్ : యలమంచిలి నగరం, మండలంలో పలు చోట్ల వందేమాతరం సామూహిక గీతాలాపన జరిగింది. మున్సిపాలిటీలో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, కమిషనర్ బిజెఎస్‌ప్రసాదరాజు, మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ కె.వరహాలు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ కొండలరావు ఆధ్వర్యాన, సబ్‌ట్రెజరీ, జైలు ఆవరణలోనూ కార్యక్రమాలు నిర్వహించారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం భార్గవి స్కూల్‌లో సామూహిక వందేమాతరం ఆలాపన జరిగింది. స్కూల్ కరస్పాండెంట్ ద్వారపురెడ్డి రవి మాట్లాడారు. మాజీ సర్పంచ్ పొన్నగంటి అప్పారావు, అప్పికొండ అప్పారావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం ఆలాపన జరిగింది. మోస రామకృష్ణ, కొండలరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వందేమాతరం గేయం విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

వడ్డాది : వడ్డాది జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం ప్రసన్న కళ, కొత్తూరు ఎలిమెంటరీ పాఠశాలలో హెచ్ఎం బి వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు.

అనకాపల్లి రూరల్ : టిడిపి పార్లమెంట్ కార్యాలయం ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు వందేమాతరం గీతాలాపన చేశారు. జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, కాంగ్రెస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అమృతపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గొటివాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో వందేమాతర జాతీయ గేయాన్ని సామూహిక ఆలాపన చేశారు. కార్యక్రమంలో రెడ్డి రామనాయుడు, హెచ్ఎం శ్రీనివాసరావు, భూపతి అప్పారావు పాల్గొన్నారు.

నర్సీపట్నం : మండలంలోని పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో గీతాలాపన చేయించారు. పాఠశాలలో వందేమాతరం 150 రంగవల్లులు తీర్చిదిద్దారు,



అనకాపల్లి జిల్లా పోలీసు ఆఫీసు వద్ద గీతాలపన చేస్తున్న దృశ్యం

10 నుంచి జిల్లాస్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 15 నుంచి 29 ఏళ్లలోపు యువ కళాకారులకు ఈ నెల 10వ తేదీన అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు ఏడు విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయి మొదటి స్థానంలో నిలిచిన విజేతలను జాతీయ స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. సెట్విన్ సీఈవో కె.కవిత మాట్లాడుతూ పోటీలలో పాల్గొనే వారి పేర్లు, వివరాలు http://forms.gle/sqUJBLyq6Sgx45sUA ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 7989781344, 8885721164 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిఈఓ అప్పారావు నాయుడు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ సేవా సంఘం ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన, ఆత్మీయ కలయిక, ఈనెల 9 ఆదివారం కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఏఎంఏఎల్ హైస్కూల్ వద్ద అంగరంగ వైభవంగా జరుగుతుందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన సమావేశంలో రవికుమార్, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అనకాపల్లి అసెంబ్లీ, మునగపాక మండలంలో నివసిస్తున్న బ్రాహ్మణ కుటుంబాలకు ఆహ్వానం అందజేశామన్నారు. సమావేశంలో తమ్మిరాజు, మళ్ళీ బాబు, పేరూరి బుజ్జి, ఎన్ ప్రశాంత్ పాల్గొన్నారు.

చినప్పన్నపాలెం మాజీ సర్పంచ్ అచ్చియ్యదొర మృతి

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : మండలంలోని సీనియర్ వైసీపీ నేత, చిన్నప్పన్నపాలెం మాజీ సర్పంచ్ దొండా అచ్చియ్యదొర శుక్రవారం మృతి చెందారు. అచ్చియ్యదొర కొద్దిరోజుల క్రితం తన ఇంటి వద్ద మెట్లపై జారిపడి గాయపడ్డారు. నాటి నుండి అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. అచ్చియ్యదొర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, చోడవరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. మూడు దఫాలు గ్రామ సర్పంచ్‌గా, రెండు పర్యాయాలు విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా, వడ్డాది పిఎసిఎస్ ఉపాధ్యక్షుడిగా, కస్పా నీటి సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. రాష్ట్ర విభజన తరువాత ఆయన వైసీపీలో చేరి నాటి నుండి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. ఈ ప్రాంతంలో రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఆయన కృషి చేశారు. అచ్చియ్యదొర మృతికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పిటిసి దొండా రాంబాబు, వైసిపి మండల అధ్యక్షుడు కే.అచ్చెన్నాయుడు, పలు పార్టీల రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

వైసిపి అరట్లకోట అధ్యక్షునిగా అప్పారావు

ప్రజాశక్తి-పాయకరావుపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అరట్లకోట గ్రామ శాఖ అధ్యక్షులుగా ఆ పార్టీ సీనియర్ నాయకులు పేపకాయల అప్పారావును నియమించారు. అరట్లకోటలో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులుగా అప్పారావును నియమించినట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు ధనిశెట్టి బాబూరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో ప్రకటించారు.

రెండో శనివారం యథావిధిగా పాఠశాలల నిర్వహణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 8వ తేదీ రెండవ శనివారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో పని చేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు యధావిధిగా పని చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మొంథా తుఫాన్ కారణంగా ఇచ్చిన సెలవునకు ప్రత్యామ్నాయంగా నవంబర్ 8వ తేది రెండవ శనివారం సదరు పాఠశాలలు పని చేయవలసిందిగా తెలియజేశారు.

పారా లీగల్ వాలంటీర్ల ఎంపిక

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : పట్టణంలోని సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ సబ్ కోర్టు ప్రాంగణంలో పారా లీగల్ వాలంటీర్లు ఎంపిక ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. మొత్తం 26 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్పందన, బార్ అసోసియేషన్ సెక్రటరీ లాలం వెంకట రామకృష్ణారావు, ఏజిపి డి వెంకటరావు, బి హరిశంకరరావు, టీ నూకరాజు ప్యానెల్ 25 మందిని పారా లీగల్ వాలంటీర్లుగా ఎంపిక చేశారు. జిల్లా జడ్జి చెన్నంశెట్టి రాజు, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఆర్ సన్యాసి నాయుడు వర్చువల్‌గా హాజరయ్యారు.

వ్యాధి నిర్ధారణ చేసి మందులు అందించాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పాయకరావు బోనంగి గ్రామంలో కొద్ది రోజులుగా పశువులు మృత్యువాత పడుతున్నాయని, మృతి చెందిన ఆవు దూడకు పోస్టుమార్టు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసి, మిగిలిన పశువులకు మందులు అందించాలని ఆ గ్రామ సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె పశు వైద్యాధికారిని కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువులకు అవసరమైన ఔషధాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామంలో వెంటనే డీ-వార్మింగ్ కార్యక్రమం చేపట్టాలని డిమాండ్ చేశారు.

భూసేకరణ ప్రభావిత గ్రామాల నాయకులతో..

కలెక్టర్ సమావేశం

ఆర్ఆర్ కాలనీ తరలింపుపై చర్చ



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో భూసేకరణ ప్రభావిత గ్రామాల ప్రజా ప్రతినిధులు, పలువురు నాయకులతో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ శుక్రవారం నర్సీపట్నం ఆర్డీఓ వివి రమణ తో కలిసి తహసిల్దార్ కార్యాలయంలో సమావేశమై, ఆర్ఆర్ కాలనీకు నిర్వాసితులు తరలింపు పై చర్చించారు. వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో రాజయ్యపేట, బోయపాడు, బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్ పురం, వేంపాడు రెవెన్యూలో అమలాపురం, పాటిమీద, మూలపర్ర గ్రామాల్లో భూసేకరణ చేపట్టిన విషయం తెలిసిందే. పరిశ్రమలు స్థాపన కోసం చేపట్టిన భూసేకరణలో కొన్ని గ్రామాల్లో నివాస గృహాలు కూడా తొలగించనున్నారు. తొలగించనున్న నివాస గృహాలకు సంబంధించి 290 కుటుంబాల్లో 745 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించి, వీరందరికీ బోదుగల్లం వద్ద నిర్మించుచున్న ఆర్ఆర్ కాలనీ యందు ఒక్కొక్కరికి 0.05 సెంట్లు విస్తీర్ణంతో కూడిన ప్లాటు ను కేటాయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆయా గ్రామాలకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, కొంతమంది నాయకులతో గ్రామాల వారీగా చర్చించారు. నివాస గృహాలు కోల్పోయిన వారందరూ త్వరగా ఇల్లులు ఖాళీ చేసి, ఆర్ ఆర్ కాలనీ నందు గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. ఎంత సమయంలో గృహాలు ఖాళీ చేయగలరని నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఏడాది కాలం సమయం కావాలని నాయకులు కలెక్టర్ ను కోరారు. ఆర్ఆర్ ప్యాకేజీ 8 లక్షల 98 వేల మాత్రమే ఇచ్చారని, నిర్వాసితులు దీంతో గృహాలు నిర్మించుకోలేని పరిస్థితి నెలకొందని, ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోయాయని కాబట్టి సిమెంట్,ఐరన్ 60 శాతం రాయితీపై సరఫరా చేయాలని, రవాణా ఖర్చు ప్రభుత్వమే భరించాలని కోరారు. చందనాడ ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్ మాట్లాడుతూ తమ్మయ్యపేట లో సర్వేనెంబర్ 90లో గల భూమికి, ఇల్లులు,షెడ్డులకు ఇంకా పరిహారం చెల్లించాలని, వెంటనే చెల్లించాలని కోరారు. మూలపర్ర గ్రామానికి చెందిన సూరకాసుల గోవిందు మాట్లాడుతూ వివాహమైన ఆడపిల్లలకు, మనవడు, మనవరాళ్లుకు కూడా ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, బోర్లు, బావి లకు కూడా పరిహారం చెల్లించాలని, అమలాపురం సర్పంచ్ పెదపూడి శంకర్రావు, ఉపసర్పంచ్ గంటా నరసింగరావు మాట్లాడుతూ ఆర్ఆర్ కాలనీకి తరలింపు పై నివాస గృహాలు కోల్పోయిన కుటుంబ సభ్యులతో మాట్లాడి, తెలియజేస్తామన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, డిఎల్ పురం ఎంపీటీసీ సభ్యులు కొండ్ర కనకారావు, చందనాడ టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పుణ్యమంతుల బాబ్జి పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం: బాలల దినోత్సవంలో భాగంగా శుక్రవారం పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ బొమ్మల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన బొమ్మలు ఆకట్టుకున్నాయి. పోటీలలో వివిధ మండలాలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, తోట ప్రసాదు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ అరెస్టు

ప్రజాశక్తి-నర్సీపట్నం: విద్యార్థినిని వేధింపుల కేసులో నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్ కోన నారాయణరావును అరెస్టు చేశామని సీఐ గోవిందరావు తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినిని గెస్ట్ లెక్చరర్ నారాయణరావు గత కొంతకాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతుండడంతో గురువారం సాయంత్రం విద్యార్థి సంఘాలు చేసిన ఆందోళనలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజు నారాయణరావును విధుల నుంచి తొలగించారు, ఈ అంశం పలు సోషల్ మీడియాలో రావడంతో విషయం తెలుసుకున్న స్థానిక సీఐ గోవిందరావు విద్యార్థిని వద్ద తీసుకున్న స్టేట్మెంట్ ఆధారంగా శుక్రవారం లెక్చరర్ నారాయణరావుని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.



సంబరాలు జరుపుకుంటున్న హాకీ క్రీడాకారులు

హాకీ క్రీడకు వందేళ్లు

- సంబరాలు చేసిన క్రీడాకారులు

ప్రజాశక్తి- నక్కపల్లి: భారతదేశంలో హాకీ క్రీడా వంద ఏళ్ళు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ క్రీడాకారులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక హాకీ టర్ఫ్ క్రీడా మైదానంలో స్పోర్ట్స్ ఆధారటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం విజయ, కోచ్ రాంబాబు కలిసి విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేసి సందడి చేసారు. అనంతరం జాతీయ జెండాను పట్టుకుని ర్యాలీ చేపట్టారు.హాకీ క్లబ్ ఫౌండర్ సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, రామచంద్రరావు రంజిత్, నానాజీ, పిడి నీరజ, ధనలక్ష్మి, తదితరులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ: కేన్సర్ పట్ల ప్రజలందరు అవగాహన కలిగి ఉండాలని గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు శ్యామ్, కీర్తి సూచించారు. శుక్రవారం గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ, పొగతాగడం, మద్యం సేవించడంతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారులు శివప్రసాద్, జానకిల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవనశైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని చెప్పారు. బీపీ, సుగర్‌లతో పాటు క్యాన్సర్ కేసులు కూడా గణనీయంగా నమోదవుతున్నాయన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ నూకరాజు, ఫార్మసిస్ట్ కొండబాబు, హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.



రోలుగుంటలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

మత్స్యకారుల వంటా వార్పు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రాణాలైనా అర్పిస్తాం కానీ, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయబోయేనివ్వమని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెట్టిన శాంతియుత రిలే దీక్షలు శుక్రవారం నాటికి 55వ రోజుకు చేరుకుంది. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు, మత్స్యకార మహిళలు వంటా-వార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సభ్యులు, మత్స్యకార నాయకులు బి.బాబ్జి మాట్లాడుతూ, బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ చేపల వేటకు వెళ్లకుండా ఆకలి కేకలతో కడుపు మండుతున్నప్పటికీ ఆందోళన కొనసాగిస్తున్నామని, తమ సమస్య ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవన ఉపాధి, ఉనికికి ప్రమాదం వాటిల్లుతుందని మత్స్యకారుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడు కోవడం సరైన పద్ధతి కాదన్నారు. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు అక్రమ కేసులు బనాయించి, భయందోళనకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలకు భయపడే ప్రసక్తే లేదని, బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, పిక్కి తాతీలు, కాశీ, బైరాగిరాజు,పైడితల్లి, నూకమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



సరకులు అందజేస్తున్న సర్పంచ్

తుపాన్ బాధితులకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సీహెచ్. నాగాపురం గ్రామంలో మొంథా తుపాన్ బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొలగాని రామారావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన బాధితులకు 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, వంట నూనె, కేజీ పంచదార వంటి నిత్యవసరాలు అందిస్తూ ఆదుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

గొలుగొండ గ్రామంలో కూడా తుపాన్ బాధితులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు గండేపల్లి రాము, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టరన్ పుల్లేటికుర్తి రమేష్, గ్రామ టీడీపీ అధ్యక్షులు పోతల లోవరాజు, గొలుగొండ మండల జనసేన ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, డీలర్ సూర్యప్రభ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

హైస్కూల్‌లో భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం ఏఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎంశ్రీ పథకం ద్వారా మంజూరైన రూ.23.10లక్షలతో నిర్మాణం చేపట్టనున్న విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల భవన నిర్మాణానికి సర్పంచ్ లోచల సుజాత శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ ప్రయోగశాల వల్ల విద్యార్థులకు మరింత విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లగుడు వెంకట రాజులనాయుడు, ప్రధానోపాధ్యాయులు జి.కృష్ణ ప్రసాద్, ఎంపిటిసి రుత్తల శివరామకృష్ణ, కూటమి నాయకులు చింతల స్వామినాయుడు, కర్రి ప్రకాష్‌రావు, ఉపాధ్యాయులు రమేష్, దేవుడు, రాజేశ్వరమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మార్కెట్‌లోకి హ్యుందాయ్ న్యూ మోడల్స్



న్యూ మోడల్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని ప్రముఖ ఆటోమొబైల్ డీలర్లలో ఒకరైన శ్రీ జయలక్ష్మి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (లక్ష్మి హ్యుందాయ్) ఖాతాదారులు ఎంతగానో ఎదురుచూస్తున్న కొత్త మోడళ్లు నగరానికి రానే వచ్చాయి. దీనిలో భాగంగా ఆల్-న్యూ హ్యుందాయ్ వేన్యు, వేన్యు ఎన్ లైన్‌లను గురువారం లాంఛ్ చేశారు. వీటిని శరత్ నల్ల (సిఇఒ - షిఫ్ట్‌వేవ్ టెక్నాలజీస్, యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్) ఆవిష్కరించారు. ఈ వాహనాలు 'టెక్ అప్.. గో బియాండ్' స్ఫూర్తిని ప్రతిబింబించాయి. ప్రతి డ్రైవ్‌ను స్మార్ట్‌గా, సురక్షితంగా, మరింత చేరువ చేసేలా ఇవి రూపుదిద్దుకున్నాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా క్లస్టర్ హెడ్ మిసోమనాథ్ లాల్ మాట్లాడుతూ నూతన మోడళ్ల ప్రత్యేకతను తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ జిఎం (అకౌంట్స్ - ఫైనాన్స్) జి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

వాహనాల ప్రత్యేకతలు

ఆల్-న్యూ హ్యుందాయ్ వేన్యు మెరుగైన స్థలం కలిగి ఉంది. రోడ్డుపై పెద్ద ఎస్‌యువి ఉనికిని అందిస్తుంది. ఇది మునుపటి వేన్యు కంటే 48 ఎంఎం ఎత్తుగా, 30 ఎంఎం వెడల్పుగా ఉంది. వీల్‌బేస్ 20 ఎంఎం ఎక్కువగా, 2520 ఎంఎం వద్ద ఉంటుంది. అత్యాధునిక కనెక్టెడ్ కార్ నావిగేషన్ కాక్‌పిట్ వ్యవస్థను కలిగి ఉంది. డ్యూయల్ 62.5 సెంటీమీటర్లు, కర్వ్ పనోరమిక్ డిస్‌ప్లేలు, టెర్రాజో-ఆకృతిగల క్రాష్ ప్యాడ్ కలిగి ఉంటుంది 20 కంట్రోలర్ల వరకు ఓవర్ ది ఎయిర్ వాహన అప్‌డేట్‌లు చేయగల సామర్థ్యం కలిగి ఉంది. డ్యూయల్ టోన్ లెదర్ సీట్లు, ఎలక్ట్రిక్ 4 వే డ్రైవర్ సీట్లు, 2 స్టెప్ రిక్లైనింగ్ వెనుక సీట్లు, రియర్ ఏసీ వెంట్స్ ఉన్నాయి. 65 కంటే ఎక్కువ అధునాతన భద్రతా ఫీచర్లు ఉన్నాయి, వీటిలో 33 భద్రతా ఫీచర్లు అన్ని వేరియంట్‌లలో ప్రామాణికంగా ఉంటాయి.

ఆల్-న్యూ హ్యుందాయ్ వేన్యు ప్రారంభ ధరలు రూ.7,89,900 (ఎక్స్-షోరూమ్) నుంచి మొదలవుతాయి.


సామగ్రి ఇస్తున్న ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జె లక్ష్మీనారాయణ గిరిజన విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. చింతపల్లి మండలంలో కోరుకొండ, కుడుముల, రాళ్ల బంధ, బలపం, వేలం జీవి, గిల్ల బంద, చెరువూరు, తడపల్లి, తదితర శుక్రవారం ఆయన పర్యటించారు. గిరిజన విద్యార్థులకు అవసరమైన పలకలు, పెన్నులు, నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు వంటి విద్యా సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు

రాష్ట్ర స్థాయి పోటీలకు కీర్తన ఎంపిక



ప్రజాశక్తి- కొత్తకోట: రావికమతం మండలం దొండపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన కె. కీర్తన రాష్ట్ర స్థాయి శాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యిందని పాఠశాల పిడి సిహెచ్ ఆనంద్ తెలిపారు. పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న బాలిక కీర్తన శుక్రవారం మాకవరపాలెం లో జిల్లా స్థాయి క్రీడా పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ కనబరచిందని ఆయన వివరించారు. హెచ్ఎమ్ అప్పారావు అభినందించారు.


ప్రశ్నిస్తున్న సభ్యులు

మండల సమావేశంలో..
సమస్యలపై నిలదీసిన సభ్యులు

ప్రజాశక్తి-రావికమతం: పలు సమస్యలపై రావికమతం మండల పరిషత్తు సర్వ సభ్య సమావేశంలో సభ్యులు నిలదీశారు. ఎంపీపీ పైలరాజు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బి జేఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉండగా తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ, గొంప ఎంపీటీసీ గెంజి సూర్యనారాయణ , గుడ్డిప సర్పంచ్ గుమ్మాల గణేష్ లు రావికమతం నుంచి తోటకూర పాలెం వెళ్లే రోడ్డు పరిస్థితి ఏనాడైనా మీరు చూశారా అని ప్రశ్నించారు. ఈ రోడ్డు గుండా స్థాయికి మించిన బరువుతో లారీలు వెళ్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన దగ్గర నుంచి ఆర్టీసీ బస్సులు స్టేజ్ వద్ద ఆపలేదని పలు గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు.బస్సులు ఖాళీ లేనప్పుడు బస్సులను పెంచుకోవాలన్నారు. ఫ్రీ బస్సులను ప్రవేశపెట్టిన తర్వాత బస్సులు తగ్గించి ప్రజలను నానా అవస్థలకు గురి చేయడం పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తకోట పీహెచ్‌సీలో రెండవ డాక్టర్ను తక్షణమే నియమించాలని కొత్తకోట ఎంపిటిసి పూడి దేవ, వైస్ ఎంపీపీ దంట్ల రమణ సభ దృష్టికి తీసుకువచ్చారు. వీధి కుక్కలు కరవడంతో పలువురు గాయాల పాలువుతున్నారని, వాటిని నియంత్రించాలని వైస్ ఎంపీపీ భవాని ప్రసాద్ కోరారు.

తహసిల్దార్ అంబేద్కర్ మాట్లాడుతుండగా ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఎలీసీలు ఇవ్వాలంటూ రావికమతం ఎంపిటిసి వేపాడ లక్ష్మి నాగేశ్వరావు కోరారు. ప్రైవేటు ల్యాండ్కు ఎల్పిసి ఇవ్వలేమని కరాకండిగా చెప్పడంతో సభ్యులు ప్రశ్నించారు. వైద్యాధికారి లేని ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాలు వలన ఒరిగిందేమిటి అని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, వైస్ ఎంపీపీలు దాంట్ల రమణ, భవాని ప్రసాదు పాల్గొన్నారు.

రమేష్ ఆశయ సాధనకు కృషి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



విశాఖలో నివాళి అర్పిస్తున్న సిహెచ్ నర్సింగరావు తదితరులు



అనకాపల్లిలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మిక వర్గ పోరాటాలను ఉధృతం చేయడమే రమేష్‌కు నిజమైన నివాళి అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్ వర్ధంతి కార్యక్రమం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు అధ్యక్షతన జరిగింది. తొలుత రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ రమేష్ విద్యార్థి దశ నుంచే వామపక్ష ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. డాక్టర్ వివిఎస్.కృష్ణ కాలేజీ విద్యార్థి సంఘ నాయకునిగా ఉంటూ జిల్లాలో విద్యార్థి ఉద్యమాన్ని విస్తరించడంలో ప్రముఖ పాత్ర పోషించాడన్నారు తన విద్యాభ్యాసం అనంతరం చిట్టివలస జూట్‌మిల్ యూనియన్ బాధ్యతలు తీసుకొని కార్మిక వర్గాన్ని ఐక్యం చేశారన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించి, బలమైన ఉద్యమాలను నిర్మించాడన్నారు. గ్రామీణం, ఏజెన్సీలోనూ ట్రేడ్ యూనియన్ రంగాన్ని విస్తరింపజేశాడన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు పి.మణి, బి.జగన్, టి.నూకరాజు, వి.కృష్ణారావు, ఉరుకూటి రాజు, పి.వెంకటరావు, ఎం.సుబ్బారావు, ఎం.సూరీడు పాల్గొన్నారు.

తగరపువలస : సిఐటియు నాయకులు ఎస్.రమేష్ 8వ వర్ధంతిని చిట్టివలస సిఐటియు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్.మూర్తి, ఎస్.అప్పలనాయుడు, నేలత రాము, పల్ల పెంటరాజు, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు

ఆనందపురం : మండలంలోని బొడ్డపాలెంలో ఎస్.రమేష్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.ద్రాక్షాయణి, కె.నాగరాణి, ముత్యాలమ్మ, జి.దుర్గారావు, రామలక్ష్మి, నర్సియమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : కార్మికోద్యమ నేత కామ్రేడ్ ఎస్.రమేష్ 9వ వర్ధంతి సభ అనకాపల్లి సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. రమేష్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కామ్రేడ్ రమేష్ ఉమ్మడి విశాఖ జిల్లా ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించారన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పెద్దఎత్తున పోరాడడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, అల్లు రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, జి.సుభాషిణి, నాగిరెడ్డి సత్యనారాయణ, నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సిఐటియు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్.రమేష్ పోరాటాలను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. అచ్యుతాపురంలో శుక్రవారం కామ్రేడ్ రమేష్ 8వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కన్వీనర్ కె సోమునాయుడు, నాయకులు కే పైడ్రాజు, రాములమ్మ, వై రాజు, ఏ తిరుపతిరావు, పి శ్రీనివాసు, దుర్గారావు, మహేష్ పాల్గొన్నారు.

నర్సీపట్నం: ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదిన ధన్యజీవి కామ్రేడ్ రమేష్ అని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ కొనియాడారు. సిఐటియు ఉమ్మడి విశాఖ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎస్ రమేష్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ, నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక కర్షకులకు వ్యతిరేకంగా పలు విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగట్ల రాజు, నారాయణమూర్తి, ఐద్వా నాయకులు ఎల్ గౌరీ, కే.సూర్య ప్రభ, చిరంజీవి, రామకృష్ణ, శివ, మల్లేష్ పాల్గొన్నారు.


నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న అజశర్మ


ముగిసిన అనకాపల్లి పుస్తక మహోత్సవం


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న అజశర్మ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలోని అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో నిర్వహించిన అనకాపల్లి తొలి పుస్తక మహోత్సవం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఎనిమిది రోజుల పాటు సాగిన ఈ మహోత్సవం పుస్తక ప్రియులు, సాహిత్యాభిమానులు, విద్యార్థులు, కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. వడ్డాది పాపయ్య సాహిత్య వేదిక వద్ద జరిగిన చిత్రలేఖనం, సైన్స్ వ్యాసరచన, ఏకపాత్రాభినయం పోటీలు, నృత్య ప్రదర్శనలు, ధింసా నృత్య ప్రదర్శన, మ్యాజిక్ షో, గీతాలాపనలు, జానవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలు ఈ మహోత్సవానికి విశేష ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల, కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని అనకాపల్లి బుక్ ఫెస్టివల్‌ను స్ఫూర్తిదాయక సాంస్కృతిక, సాహిత్య వేదికగా మలిచారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ స్థాయిలలో విజేతలుగా ఎంపిక చేసి, బహుమతులు ప్రశంసా పత్రాలు డాక్టర్ గణేష్ చేతుల మీదుగా అందజేశారు. ఎనిమిది రోజులపాటు సాహిత్య వేదికపై జరిగిన పుస్తక సమీక్షలు, పద్య కవితా చర్చా గోష్ఠులు పాల్గొన్న కవులు, రచయితలు, కళాభిమానులు, పుస్తకప్రియులు, గాయక బృంద సభ్యులకు ప్రత్యేక ప్రశంసాపత్రాలు అందజేశారు.

ముగింపు సభ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె. లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పుస్తక మహోత్సవం మొత్తం కార్యక్రమాలు విజయవంతంగా జరిగిన తీరు, ప్రజల అద్భుత ఆదరణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ మహోత్సవంలో 100 పబ్లిషర్లు భాగస్వామతో 1,00,000 పుస్తక శీర్షికలు ప్రదర్శించబడ్డాయని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పుస్తక పఠన సంస్కృతిని విస్తరించడం లక్ష్యంగా, అనకాపల్లి పుస్తక ప్రియులు సాహిత్యవేత్తల సహకారంతో ఈ మహోత్సవం అంగరంగ వైభవంగా ముగిసిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది 2వ అనకాపల్లి పుస్తక మహోత్సవంను మరింత విస్తృత స్థాయిలో నిర్వహిస్తామని ప్రకటించారు. పుస్తక మహోత్సవం ఘన విజయానికి తోడ్పడ్డ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్, జీవిఎంసి జోనల్ కమిషనర్ కే.చక్రవర్తికి, మీడియా మిత్రులకు, అనకాపల్లి పుస్తక ప్రియులకు, ప్రజలకు లక్ష్మయ్య, అనకాపల్లి బుక్ ఫెస్టివల్ కన్వీనర్ ఉమామహేశ్వరరావు, జేవివి రాష్ట్ర బాధ్యులు త్రిమూర్తులరెడ్డి, ఉదయ్ కిరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

పుస్తక ప్రదర్శనను చివరి రోజు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ సందర్శించారు. నిర్వాహకులను అభినందించారు. మళ్లీ ఇదే ఉత్సాహంతో, మరిన్ని పుస్తకాలతో వచ్చే సంవత్సరం తిరిగి వస్తుందని చెప్పారు.


ముగింపు సభలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాల మంజూరు కొరకు 2025-26 విద్యా సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారిణి కె. శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (పీఎం యశస్వీ) నందు అనకాపల్లి జిల్లాలోని అన్ని మండలాల పాఠశాల, కళాశాలలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బీసీ, ఈబీసీ, డిఎన్‌టి (సంచార జాతులు) విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. వారి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు కలిగి ఉండాలన్నారు. తమ గత సంవత్సరపు మార్కులు జాబితా, విద్యార్థి బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. సంబంధిత సమాచారం కొరకు డివిజన్ పరిధిలో సహాయ సంక్షేమాధికారుల కార్యాలయాలకు సంబంధించి (చోడవరం, నర్సీపట్నం 9989458416, ఎలమంచిలి, అనకాపల్లి 9701399963, నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.